క్లుప్తంగా

శ్మశానవాటికలో మరమ్మతులు పూర్తి చేయండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్మశాన వాటికలో అవసరమైన సౌకర్యాలను కల్పించాలని, మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి కండ్రిక జంక్షన్ ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద హిందూ, క్రైస్తవ, ముస్లిం శ్మశాన వాటికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా శ్మశానవాటికల్లో ప్రజలకు అవసరమైన మరుగుదొడ్లు, నీటి సరఫరా, షెడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. శ్మశానవాటికలు మొత్తం మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతో పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీపై కేసు నమోదు

గుణదల(విజయవాడతూర్పు): వృద్ధుడి వద్ద ఉన్న బంగారాన్ని చోరీ చేసి పరారైన నిందితుడిపై మాచవరం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం మాచవరం కార్మికనగర్ కొండ ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణ్యం వృద్ధాప్యంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం అర్ధరాత్రి డాబాపై ఒంటరిగా నిద్రిస్తూ ఉండగా ఆ ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తి సుబ్రహ్మణ్యం వద్ద ఉన్న బంగారు గొలుసు, రెండు ఉంగరాలను చాకచక్యంగా దొంగిలించాడు. అక్కడ సమీపంలో ఉన్న సీసీ కెమెరాను సైతం తనతో తీసుకుపోయాడు. తెల్లవారి నిద్రలేచే సరికి తన వద్ద ఉన్న బంగారం పోయిందని గుర్తించిన వృద్ధుడు కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఆయన కుటుంబ సభ్యులు మాచవరం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. వృద్ధుడి కుమారుడు నాగభూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి గురైన బంగారం విలువ దాదాపు లక్షా యాభై వేల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి



విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. సమతాసేవా సమితి 14వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు చారిత్రక పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డికి గండపెండేర ధారణం, రంగస్థలానికి చెందిన గాజులపల్లి ఫరీద్‌కు రజిత హస్తకంకణ ధారణ కార్యక్రమం నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ సమతాసేవా సమితి నిర్వహించే కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన గోళ్ల నారాయణ రావు, డాక్టర్ పీవీఎన్ కృష్ణ, బోడి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు. సమతా సేవా సమితి నిర్వాహకుడు చింతా వెంకటేశ్వర్లు నిర్వహించారు. చింతా దూండీ కృష్ణ దుర్యోధనుడుగా, శ్రీ కృష్ణుడిగా గుమ్మడి విమలకుమారి శ్రీ కృష్ణరాయబారంలోని ఓ సన్నివేశాన్ని ప్రదర్శించారు. కొండవీటి వేద హాసిత ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

పేదలకు సేవలందించడమే లక్ష్యం



పాయకాపురం(విజయవాడరూరల్): పేదలకు సేవలందించడమే లక్ష్యంగా ఆజాద్ ముస్లిం కమిటీ పని చేస్తోందని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. 60వ డివిజన్‌కు చెందిన పేద ముస్లిం మహిళ చిరు వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండిని గురువారం కండ్రికలో అందజేశారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ.. గత 38 నెలలుగా పేద ముస్లిం, మైనార్టీలకు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో ప్రతి నెలా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. పేదలకు సేవా చేయాలనుకునే వారికి కమిటీలో సభ్యత్వం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్ అలీ, ఉపాధ్యక్షుడు నాగుల్‌మీరా, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా, నగర ఉపాధ్యక్షుడు షేక్ సైదులు, 58, 61, 62, 64 డివిజన్ల అధ్యక్షులు, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెరుగుతున్న రియల్ మోసాలు

- స్థానికేతరులు కొనుగోలు చేసిన భూములు వివాదంగా మారుతున్న వైనం
- భవానీపురం పీఎస్‌లో ఫిర్యాదులు



భవానీపురం పోలీస్‌స్టేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం పీఎస్ పరిధిలో రియల్‌మోసాలు పెరుగుతున్నాయి. వాటిలో కొన్ని గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రకాష్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ నేవీలో పనిచేస్తుంటాడు. అతని భార్య రమీజా సుల్తానా భర్త పంపిన డబ్బులతో గొల్లపూడిలోని సర్వే నంబరు 472/2లో 300 చదరపు గజాల స్థలం కొనుగోలు చేసింది. రూ. 29లక్షలు చెల్లించి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఒరిజినల్స్ తమ వద్ద ఉంచుకుని స్థలాన్ని విక్రయించిన వ్యక్తి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. డాక్యుమెంట్స్ ఇవ్వడం లేదు. స్థలం చూపడం లేదు. తీరా స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తులు ఆరా తీస్తే ఆ స్థలం అప్పటికే వేరొకరికి జీపీ చేసినట్లు తెలిసింది. తాము మోసపోయామని బాధితులు పోలీసులను ఆశ్రయించగా తప్పుడు రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదైంది.

–విశాఖపట్నం కృష్ణానగర్‌కు చెందిన వైద్యుడు పూసర్ల విశ్వేశ్వరరావు గొల్లపూడిలో ఎకరం భూమి కొనుగోలు చేశాడు. ఇబ్రహీంపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్దిరోజుల క్రితం భూమిని రెవెన్యూ రికార్డుల్లో తన పేర మార్చాలని తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించారు. విశ్వేశ్వరరావు కొనుగోలు చేయడానికి నెల రోజుల ముందు సదరు భూమిని వేరే వ్యక్తికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

– విద్యాధరపురానికి చెందిన వేమూరి రమేష్ భవానిపురం మహమ్మదీయ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో 210 చదరపు గజాల స్థలం కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. తొలుత కొంత నగదు చెల్లించాడు. ఆ తర్వాత మరి కొంత చెల్లించాడు. రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా కాలయాపన చేసి రిజిస్ట్రేషన్ చేయకుండా తనను మోసం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇవన్నీ ఇటీవల కాలంలో నమోదైన కేసుల్లో కొన్ని మాత్రమే.. భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో రియల్ మోసాలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల కాలంలో ఫిర్యాదుదారుల సంఖ్య పెరిగిపోయింది. ఒక స్థలాన్ని ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేయడం, ఒకరి స్థలాన్ని మరొకరికి విక్రయించడం, ఒప్పందాలు చేసుకుని డబ్బులు తీసుకోవడం... రిజిస్ట్రేషన్ చేయకుండా మోసగించడం ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. స్టేషన్ పరిధిలో కొంత భాగం అర్బన్, మరి కొంత భాగం రూరల్‌లో ఉంది. ప్రధానంగా స్టేషన్ పరిధిలోని గొల్లపూడి నుంచి ఎక్కువగా ఈ తరహా నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక్కడ భూముల ధరలు అధికంగా ఉండటమే ఇందుకు కారణం. ఇలాంటి కేసులు చాలా వరకు ' పెద్దమనుషుల' వద్ద పంచాయతీలే ఎక్కువగా జరుగుతున్నాయి. పలుకుబడి ఉంటే కేసు వరకు వెళుతోంది. చాలా వరకు ఫిర్యాదులపై కేసులు కట్టడం లేదని బాధితుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఫిర్యాదుదారుల్లో స్థానికేతరులు అధికంగా ఉంటున్నారు. వీరికి స్థానికంగా బలం లేకపోవడంతో తమకు జరిగిన మోసాలపై ఫిర్యాదు చేయడానికి సాహసించలేకపోతున్నారు. బ్రోకర్లు, రియల్ వ్యాపారులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ఇటువంటి మోసాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో తరచూ మోసాలు చేసేవారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్



పటమటలో క్యూలో ఉన్న ఓటర్లు



మైలపల్లి పోలీసు వీఎంసీ పాఠశాల ప్రాంగణంలో ఓటు వేస్తున్న గ్రాడ్యుయేట్లు



పటమటలో చంటి పిల్లలతో ఓటు వేసేందుకు వస్తున్న మహిళలు

- పశ్చిమంలో 56.02 శాతం ఓటింగ్
- నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 9,868
- పోలైన ఓట్లు 5529

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన ఎన్నికలకు సంబంధించి పశ్చిమ నియోజకవర్గంలో 56.02 శాతం ఓట్లు పోలయ్యాయి. గురువారం జరిగిన పోలింగ్ చాలా మందకొడిగా జరిగింది. పశ్చిమ నియోజకవర్గంలో మూడు ప్రాంగణాల్లో 15 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. 25 మంది అభ్యర్థులు పోటీ పడగా ప్రధానంగా పీడీఎఫ్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, టీడీపీ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ బరిలో ఉన్నారు.

పశ్చిమంలో పోలైన ఓట్లు 5,529

నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు మొత్తం 9,868 మంది ఉండగా అందులో 5,529 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 56.02 శాతం ఓట్లు పోలైనట్లుగా అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం వరకూ చాలా మందకొడిగా కొనసాగినా మధ్యాహ్నం నుంచి కొంచెం ఊపందుకుంది. మైలపల్లి పోలీసు వీఎంసీ పాఠశాలలో ఆరు పోలింగ్ కేంద్రాలు, గాంధీజీ వీఎంసీ పాఠశాలలో ఆరు, ఆర్టీసీ జోనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో మూడు పోలింగ్ కేంద్రాలు కొనసాగాయి. గాంధీజీలోని 82వ బూత్‌లో 906కు 410 ఓట్లు, 83వ బూత్‌లో 600 ఓట్లుకు 245, 83ఏ బూత్‌లో 600 ఓట్లుకు 258, 86వ బూత్‌లో 660 ఓట్లుకు 314, 87వ బూత్‌లో 532 ఓట్లుకు 205, 88వ బూత్‌లో 496 ఓట్లుకు 164 ఓట్లు పోలయ్యాయి. మైలపల్లి వీఎంసీ స్కూల్‌లోని 80వ నంబర్ బూత్‌లో 600 ఓట్లుకు 364, 80ఏ బూత్‌లో 621 ఓట్లుకు 343 ఓట్లు, 81వ బూత్‌లో 640 ఓట్లుకు 385, 81ఏ బూత్‌లో 631 ఓట్లుకు 327, 85వ బూత్‌లో 600 ఓట్లుకు 340ఓట్లు, 85ఏ బూత్‌లో 511 ఓట్లుకు 262 ఓట్లు పోలయ్యాయి. ఆర్టీసీ జోనల్ సెంటర్ ప్రాంగణంలో 79వ పోలింగ్ బూత్‌లో 800 ఓట్లుకు 452, 79ఏ బూత్‌లో 820 ఓట్లుకుగాను 439, 84వ బూత్‌లో 851 ఓట్లకుగాను 455 పోలయ్యాయి. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా కూటమి నేతలు నియోజకవర్గం మొత్తం భారీగా ఓట్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది. డివిజన్ల వారీగా కేటాయించిన నాయకులు తమ వద్ద ఉన్న లిస్టుల ప్రకారం అధిక సంఖ్యలో ఓటర్లను ప్రలోభపెట్టి ఓట్లు వేయించారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. గాంధీజీ హైస్కూల్ సమీపంలో, విద్యాధరపురంలోని ఆయా ప్రాంతాల్లో కూటమి నేతలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ హల్‌చల్ చేస్తూ కనిపించారు.

పరిశీలించిన మంత్రి సత్యకుమార్

గ్రాడ్యుయేట్ ఎన్నికలను పురస్కరించుకొని రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ గురువారం నియోజకవర్గంలో పర్యటించారు. గాంధీజీ మున్సిపల్ పాఠశాల వద్ద ఉన్న పోలింగ్ బూత్ సమీపంలో ఉన్న కూటమి నేతలతో కలిసి ఎన్నికల సరళిపై ఆరా తీశారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



తాగునీటి సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో పర్యటించారు. గొల్లపూడి, జక్కంపూడి పంచాయతీల పరిధిలోని వైఎస్సార్ కాలనీ మొత్తం పర్యటించి రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మరమ్మతులు ఏమైనా ఉంటే వాటిని పూర్తి చేయాలని సూచించారు. ఆహ్లాదకర వాతావరణం పెంపొందించడానికి మొక్కలు నాటాలని పేర్కొన్నారు. వీధి దీపాలు నిత్యం వెలిగేలా చూడాలని, డ్రెయినేజీ సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షిస్తూ కాలనీని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కమ్యూనిటీ హాల్ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఈఈ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు రంగులు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలకు రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. క్రేన్ సహాయంతో ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఏఎస్ రామారావు రోడ్డు, మధుచౌక్, విశాలాంధ్ర రోడ్డు, నిమ్మతోట సెంటర్, సిద్ధార్థ జంక్షన్, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని విద్యుత్ స్తంభాలకు పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి.

దాసాంజనేయస్వామి ఆలయంలో

వస్తు సామగ్రి సరఫరాకు టెండర్ల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ఏడాది పాటు స్వామి వారి లాకెట్ చేతి కంకణాలు, లామినేషన్ ఫొటోలు, రౌండ్ స్టిక్కర్లు, స్వామి వారి అలంకరణ నిమిత్తం పువ్వుల దండలు సరఫరా చేయు హక్కులకు సీల్డ్ టెండర్‌లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన టెండర్‌దార్లు తప్పనిసరిగా ఆధార్ కార్డ్, పాన్ నంబర్, ఫోన్ నంబర్, వస్తు సేవల పన్ను ఖాతా నెంబర్(జి.ఎస్.టి) కలిగి ఉండాలన్నారు. టెండర్ షెడ్యూల్ మార్చి ఒకటి నుంచి 10వ తేదీ వరకు ఉంటుందన్నారు. పూర్తి చేసిన టెండర్ షెడ్యూల్‌లను వచ్చే నెల 11వ తేదీ ఉదయం 10 గంటల వరకు స్వీకరిస్తామని చెప్పారు. అదే రోజు ఉదయం 10.30 గంటలకు దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, టెండర్ దారుల సమక్షంలో టెండర్లు తెరుస్తామన్నారు. మరింత సమాచారం, ధరావత్తు తదితర వివరాల కోసం ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

పూర్తిస్థాయిలో మురుగు తొలగించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో నిరంతరం డీసిల్ట్ ప్రక్రియను పూర్తి స్థాయిలో నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సర్కిల్–3 పరిధిలోని మహానాడు రోడ్ చివర ఉన్న బల్లెంవారి వీధిలో ఉన్న గుంట తిప్ప అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండకుండా సైడు డ్రెయిన్లలోకి వెళ్లేలా చూడాలన్నారు. ఆ దిశగా అధికారులు పర్యవేక్షిస్తూ మైనర్, మీడియం, మేజర్ డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ చేస్తుండాలని పేర్కొన్నారు.

అవసరమైతే వాహనాలతోపాటు సిబ్బందిని పెంచుకుని వర్షాకాలం రాక ముందే నగరంలో డీసిల్టింగ్ పనులు మొత్తం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాద నిరోధక నిబంధనలు పాటించాలి



ఫైర్ ఎస్టింగ్విషర్ ద్వారా మంటలను ఆర్పుతున్న దృశ్యాన్ని పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): అగ్నిప్రమాదం జరిగినప్పుడు దానిని నిరోధించే పరికరాలు ప్రతి పాఠశాలలో, హాస్పిటల్స్‌లోనూ కచ్చితంగా ఏర్పాటు చేసి నిబంధనలను పాటించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. 58వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని కార్తికేయ హాస్పిటల్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఆకస్మాత్తుగా అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఎస్టింగ్విషర్ ద్వారా మంటలను ఎలా ఆర్పుతారు, ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా వారిని సురక్షితంగా ఎలా కాపాడుతారు వంటి పలు అంశాలను అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా హాస్పిటల్ మొత్తంలో ఎమర్జన్సీ ఎగ్జిట్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలించి అవి ఉన్నట్లు ప్రజలకు తెలిసేలా దారిలో రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన హాస్పిటల్ మొత్తం తిరిగి నిబంధనలను పరిశీలించారు.

నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి..

ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నగరపాలక సంస్థ నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ పొందాలంటే తప్పనిసరిగా అగ్నిప్రమాద నిరోధానికి అవసరమైన చర్యలు పాటించాలన్నారు. విద్యార్థులు చదువుకునే పాఠశాలలు, చికిత్స కోసం వచ్చే పేషెంట్స్ విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండింట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబుపాల్గొన్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం



కెనాల్‌రోడ్డులో బేతాళ నృత్యం



కోలాటమాడుతున్న భక్తులు



రథోత్సవంలో ఉభయదేవేరులతో మల్లేశ్వరుడు



రథం లాగుతున్న సీపీ రాజశేఖరబాబు

- కిక్కిరిసిన కెనాల్‌రోడ్డు
- అలరించిన జానపద కళారూపాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కెనాల్‌రోడ్డులో ఆదిదంపతుల రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మల్లేశ్వరుడు ఉభయ దేవేరులతో కలిసి రథాన్ని అధిష్టించి నగర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యాన కెనాల్‌రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రథోత్సవం భక్తులకు మధురానుభూతిని అందించింది. ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకొని కెనల్‌రోడ్డులో నిర్వహించే రథోత్సవం ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోలాటాలు, పులివేషాలు, లంబాడీ, బేతాళ నృత్యాలు, తదితర జానపద కళారూపాలు ముందు భాగాన నడుస్తుండగా వేదపండితుల వేదనాదం, అర్చకుల మంత్రోచ్చరణలు, భక్తుల హరహరమహాదేవ....శంభో శంకర నామస్మరణల మధ్య దేవదేవుని రథోత్సవం కనులపండువగా ముందుకు సాగింది. తొలుత శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నుంచి గంగాపార్వతీ సమేత శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లను, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) నుంచి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వార్లను, శ్రీ వసంత మల్లికార్జునస్వామి దేవస్థానం (బుద్ధువారి గుడి) నుంచి గంగా పార్వతీ సమేత శ్రీ వసంత మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఆయా ఆలయాల నిర్వాహకులు రథం సెంటర్‌కు తీసుకువచ్చారు. అమావాస్య ఘడియలు ప్రారంభమైన తర్వాత రథోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. డెప్యూటీ పోలీస్ కమిషనర్లు, అసిస్టెంట్ పోలీసు కమిషనర్లు ఇతర అధికారులు సైతం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెనాల్‌రోడ్డు మొత్తం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన వాసవి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమాలను అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకటప్రసాద్, ప్రధాన కార్యదర్శి బయన శ్రీరాజేష్ పర్యవేక్షించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం డెప్యూటీ ఈవో రత్నరాజు, పాతశివాలయం కార్యనిర్వహణాధికారి నటరాజన్‌షణ్ముగం తదితరులు సైతం పాల్గొన్నారు. అన్నసత్రం కమిటీ ప్రముఖులు వల్లంకొండ ప్రసాద్, డొగిపర్తి శంకరరావు, బొలిశెట్టి జగన్మోహన్‌రావు, చల్లా హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయేశ్వరస్వామి నగరోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ విజయేశ్వరస్వామి నగరోత్సవం గురువారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. పాతబస్తీలో పురాతన ఆలయమైన శ్రీ విజయేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం స్వామి వారికి నగరోత్సవాన్ని నిర్వహించారు.

గంగా పార్వతీ సమేత విజయేశ్వరస్వామి వారిని రావణబ్రహ్మ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం స్వామి వారికి వేదపఠనం, మంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాల నడుమ నగరోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కెనాల్ రోడ్డు, కాళేశ్వరరావు మార్కెట్, కేటీరోడ్డు, బ్రాహ్మణ వీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమాలను ఆలయ ఈఓ వెంకటరెడ్డి పర్యవేక్షించారు.



పెనమలూరు: యనమలకుదురులో గురువారం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణం బుధవారం అర్ధరాత్రి ఘనంగా చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామ మండపం వద్దకు తీసుకు వచ్చారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: శ్రీ స్రవంతికృష్ణ ఎంటర్‌టైనర్స్, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు స్రవంతి కృష్ణ ఆధ్వర్యంలో సుశీల్‌కుమార్, విజయ్, శివలీల, బెల్లంకొండ భారతి, స్వాతీ మీరాకుమార్, బన్నీలు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. గాయకుడు స్రవంతి కృష్ణ మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి నెలా విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు సాంస్కృతిక వికాసంతోనే ప్రగతి సాధ్యమని తెలిపారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

